ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 16 నవంబరు 2025



ఫ్లైఓవర్‌పై మరో పక్క పనులు జరుగుతున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు



ఏమారితే.. ఫ్లై ఓవరే...!

- ప్రమాదకరంగా పెద్దపాళ్యం ఫ్లైఓవర్
- తరచూ ప్రమాదాలతో హడల్
- ఇప్పటికి ఐదుగురికి పైగా మృత్యువాత
- పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాద బాధితులు
- ఆరేళ్లుగా సా....గుతున్న పనులు



పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై వాహనాలు రాకపోకలు సాగించే దారి

అమ్మో... ఈ ఫ్లైఓవర్‌పై ఏమారితే పైకి ఫ్లై కావాల్సిందే... ఒకటి కాదు... రెండు కాదు పదుల సంఖ్యలో ప్రమాదాలు... ఐదుగురికి పైగా మృత్యువాత... గాయపడ్డ వారి జాబితా 20 మందికి పైగానే... ఎంతో ప్రమాదకరంగా మారిన ఈ ఫ్లైఓవర్ ఉన్నది ఎక్కడో కాదు... నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ముంబై- చెన్నై జాతీయ రహదారిలో. ఒక వైపు నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వాహనదారులు హడలెత్తిపోతున్నారు.

ములకలచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పెద్దపాళ్యం వద్దనున్న రైల్వేగేటు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడేవారు. దేశంలోనే అతి పొడవైన ఎన్‌హెచ్-42 జాతీయ రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో తరచూ రైల్వేగేటు పడుతుండడంతో వాహనాలు బారులు తీరేవి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సమయం ఆదా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.49 కోట్లు మంజూరు చేసింది. 2019 సెప్టెంబరు నెలలో పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర పాటు పనులు జరిగాయి. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి దశకు చేరాయి. ఇరువైపులా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రైల్వేగేటుపై వెళ్తున్న బ్రిడ్జిపై కొంతభాగం పనులు రెండేళ్ల పాటు నిలిపేశారు. ఈ క్రమంలో సరిగ్గా 2023 సెప్టెంబరు నెలలో తిరిగి పనులు ప్రారంభించారు. రైల్వే గేటుపై ఏర్పాటు చేసేందుకు ఇక్కడే రోడ్డుకు ఒకవైపు బూస్టింగ్ గిడ్డర్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు అనుమతించారు. 11 నెలలుగా ఒక వైపు నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుడడంతో పాటు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరగుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో సతమతమవుతూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి.



ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన ముగ్గురు అన్నదమ్ములు(ఫైల్)

ఫ్లైఓవర్‌పై జరిగిన కొన్ని ప్రమాదాలు

- ఈ ఏడాది ఫిబ్రవరి 2న మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన వంశీకృష్ణ(29), రవితేజ(28)లు సత్యసాయి జిల్లా బత్తలపల్లెలో జరుగుతున్న స్నేహితుడి వివాహానికి వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలేదేరారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలోని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వద్దనున్న మట్టిదెబ్బను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వంశీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే వెనుక కూర్చున్న రవితేజ కూడా తీవ్రంగా గాయపడ్డాడు.
- మే 6న ఫ్లైఓవర్‌పై మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మయిన్‌బాషా కారును ఎదెరుగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మయిన్‌బాషాతో పాటు ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు.
- ఆగస్టు 3న ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన కుటాగుళోళ్ల చంద్రప్ప కుమారుడు వెంకటేష్(26), వేమనారాయణ కుమారుడు తరుణ్(24), ఓబులేసు కుమారుడు మనోజ్(19)లు ద్విచక్రవాహనంలో వస్తుండగా పెద్దపాళ్యం ఫ్లైఓవర్ వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ మృతి చెందారు.
- అక్టోబరు 17న ఫ్లైఓవర్‌పై రెండు లారీలు ఢీకొని ఇద్దరు డ్రైవర్లతో పాటు మరో ఇద్దరు క్లీనర్లు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.
- తాజాగా పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని శ్రీ సత్యసాయి జిల్లా మహమ్మదాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుల్తాన్ తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇలా ఈ ఫ్లైఓవర్‌పై ప్రమాదాలు పెద్ద సంఖ్యలో జరిగాయి.



ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిడ్డర్

త్వరలోనే ఫ్లైఓవర్‌పై రాకపోకలు

పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు పూర్తి చేసి అతి త్వరలోనే రెండు వైపులా వాహనాలు రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకున్నాం. పెండింగ్‌లో ఉన్న చోట బూస్టింగ్ గిడ్డర్‌ను ఏర్పాటు చేశాం. పనులు పూర్తి కావచ్చాయి. రెండు వైపులా అతి త్వరలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రమాదాలు చోటు చేసుకోకుండా సూచికలు ఏర్పాటు చేశాం.

- మధుసూధన్, ఎన్‌హెచ్ అధికారి, మదనపల్లె

పనులు త్వరగా పూర్తి చేయాలి



పెద్దపాళ్యం ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఒక వైపు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న మరో వైపు బూస్టింగ్ గిడ్డర్ పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ ఏడాది మే 6న నా కారును ఎదురుగా వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంతో నేను, నాభార్య తీవ్రంగా గాయపడ్డాం.

- మయిన్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ములకలచెరువు

టీడీఎస్ చెల్లింపులను తనిఖీ చేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వస్తు, సేవల పన్ను చట్టం (ఏపీజీఎస్టీ) 2017 కింద పన్ను చెల్లింపుదారుల చెల్లింపులను తనిఖీ చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ సుమతి, రాయచోటి అసిస్టెంట్ కమిషనర్ సునయన, మదనపల్లె అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవితో కలిసి ఆయన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రద్దు చేయబడిన పన్ను చెల్లింపుదారుల ఖాతాలకు టీడీఎస్ జమ చేయడం వల్ల భారీగా రెవెన్యూ నష్టం జరుగుతోందని తెలిపారు. టీడీఎస్ మినహాయించే ముందు, సంబంధిత కాంట్రాక్టర్ సరఫరాదారు జీఎస్టీఐఎన్ స్థితిని తప్పనిసరిగా తనిఖీ చేయాలని వారు ఉద్ఘాటించారు. జీఎస్టీఐఎన్ యాక్టివ్‌గా ఉందో లేదో నిర్ధారించుకోవాలని వారు సూచించారు. ఎంజీఎన్ఆర్, ఈజీఎస్ నిధులను విడుదల చేసిన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు యాక్టీవ్‌గా ఉన్న పన్ను చెల్లింపుదారులకు మాత్రమే టీడీఎస్ జమ చేయాలని, తద్వారా పన్ను ఏకకాలంలో వసూలయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పన్ను చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం, ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సదస్సుకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన టీడీఎస్ డిడక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా రామయ్యకు స్నపన తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారి

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్ మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను, పుష్పాలను ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం మూడో శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సుబ్బరాయుడు, ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రూ.6.52 లక్షల ఎరువులు సీజ్...!

- అనుమతులు లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు శనివారం దాడులు చేసి రూ.6.52 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు రాయచోటి ఏడీఏ శ్రీలత ప్రకటించారు. దుకాణాల్లో అనుమతులు లేని ఎరువులు, క్రిమిసంహారిణి, డ్రిప్ ఎరువులను విక్రయిస్తున్నట్లు జిల్లా అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాయచోటి ఏడీఏ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలపై దాడులు చేశారు. ఓ ఎరువుల దుకాణంలో ఎరువుల బస్తాలు, డ్రిప్ ఎరువులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో ఎరువులు, డ్రిప్ ఎరువులను రైతులకు విక్రయించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేనట్లు గుర్తించారు. ఈ క్రమంలో విక్రయించేందుకు వుంచిన 24.090 మెట్రిక్ టన్నుల ఎరువుల బస్తాలను సీజ్ చేశామని, వీటి ధర రూ.6,52,200 ఉంటుందన్నారు. ఏడీఏ మాట్లాడుతూ కాలం చెల్లిన, అనుమతులు లేని డ్రిప్ ఎరువులు, క్రిమిసంహారిణిని మందులను విక్రయించరాదన్నారు. అలా ఎవరైనా విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు వ్యాపారులు బిల్లులను తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓలు రాజేంద్ర, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీలత

ఆదివాసీల మహనీయుడు బిర్సాముండా

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న డీఆర్‌వో

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల్లో విప్లవ భావాలను రగిలించిన తొలివీరుడు, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సాముండా అని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు కొనియాడారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి బిర్సా ముండా, బాబా సాహెబ్ అంబేడ్కర్, సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి నవంబరు 15న జన జాతీయ గౌరవ దివస్‌గా జరుపుకోవడం, వారిని స్మరించుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రజలు ఎన్నుకున్న రాజ్యాన్ని స్థాపిద్దాం అనే నినాదాలతో ఆదివాసీలను తిరుగుబాటు వైపు నడిపించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని మాట్లాడారు. అనంతరం చెట్ల పెంపకం, ఓరియంటేషన్ ప్రోగ్రాం, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, సాంప్రదాయ గిరిజన నృత్య కార్యక్రమాలు, మాక్ పార్లమెంట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థినీ, విద్యార్థులు, జిల్లాలోని గిరిజన సంక్షేమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా సోమశేఖర్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా ఆడేపూడి సోమశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని అన్ని డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తన లక్ష్యమన్నారు. అందుకు అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.

డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు

- కిడ్నీ ర్యాకెట్ కేసులో వీడిన మిస్టరీ
- డీసీహెచ్ఎస్ సహా ఆరుగురి అరెస్టు
- 6 సెల్‌ఫోన్లు స్వాధీనం.. డాక్టర్ పరార్
- మరో ఎనిమిది మంది పాత్ర గుర్తింపు
- 'గ్లోబల్'లో ఒకేరోజు ఇద్దరికి కిడ్నీ మార్పిడి
- విశాఖకు చెందిన మహిళ యమున మృతి
- వివరాలు వెల్లడించిన మదనపల్లె డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేందర్, ఇతర పోలీసులు, చిత్రంలో నిందితులు (ముసుగు)

మదనపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ కేసులో మిస్టరీ వీడింది. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేసే ఇద్దరు మేనేజర్లు, విశాఖ ప్రాంతానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులతో అన్నమయ్య జిల్లా డీసీ హెచ్ఎస్, బెంగళూరుకు చెందిన కిడ్నీ మార్పిడి డాక్టర్లు దీనిలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. ఈ కేసులో కీలకంగా మారిన బెంగళూరుకు చెందిన వైద్యుడు పరారీలో ఉన్నారు. ఈ కిడ్నీ రాకెట్ ముఠా కేసుకు సంబంధించిన వివరాలను మదనపల్లె డీఎస్పీ మహేందర్.. శనివారం మీడియాకు వివరించారు.

డబ్బు ఆశ చూపి..

విశాఖపట్నానికి చెందిన ఎస్.యమున(29) ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్యలు కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తాను కూడా ఇప్పటికే కిడ్నీ విక్రయించినట్లు పద్మ తెలిపింది. ఇదే విషయాన్ని యమునతో సహజీవనం చేస్తున్న సూరిబాబుకు కూడా చెప్పారు. ఈ ముగ్గురూ కలసి యమున కిడ్నీ ఇచ్చేలా ఒప్పించారు. అనంతరం.. మదనపల్లె, సత్యసాయి జిల్లా కదిరి డయాలసిస్ కేంద్రాల్లో మేనేజర్లుగా పనిచేస్తున్న బాల రంగడు అలియాస్ బాలు, మోహరాజ్‌లను పద్మ, సత్య సంప్రదించారు. వారి సూచన మేరకు యమునను మదనపల్లెకు తీసుకొచ్చి గ్లోబల్ ఆసుపత్రి యజమాని, డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఆంజనేయులును సంప్రదించారు. ఈ నెల 9న గ్లోబల్ ఆసుపత్రిలో యమునను చేర్చారు. అప్పటికే బెంగళూరు నుంచి వచ్చిన కిడ్నీ ఆపరేషన్ స్పెషలిస్టు, ఇద్దరు సాంకేతిక సిబ్బందితో కలిసి గ్లోబల్ ఆసుపత్రిలో ఒక డోనర్ నుంచి కిడ్నీ తొలగించి, రిసీవర్‌కు ఆపరేషన్ చేశారు. అదే రోజురాత్రి యమున నుంచి కిడ్నీ తొలగించి మరో రిసీవర్‌కు సర్జరీ చేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. తర్వాత యమున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పదో తేదీ ఉదయం ఆమె మృతి చెందారు. దీంతో కంగారు పడిన కిడ్నీ ముఠా బృందం యమున మృతదేహాన్ని హుటాహుటిన తిరుపతికి తరలించారు. ఈ విషయం తెలిసి యమున తల్లి ఫిర్యాదు చేయడంతో మదనపల్లె టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇతర రాష్ట్రాలకు బృందాలు

యమున తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్లోబల్ ఆసుపత్రి యజమాని డాక్టర్ కె. ఆంజనేయులు, డయాలసిస్ కేంద్రాల మేనేజర్లు బాలరంగడు, మోహరాజ్, మధ్యవర్తులు పిల్లి పద్మ, సత్య సహా యమున వెంట వచ్చిన సూరిబాబులను అరెస్టు చేశారు. ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన బెంగళూరు వైద్యుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఎనిమిది నిందితులను గుర్తించామని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. వీరిలో మొదటి రిసీవర్‌కు కిడ్నీ ఇచ్చిన వ్యక్తి, ఇద్దరు కిడ్నీ రిసీవర్లు, బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన ఇద్దరు టెక్నీషియన్లు, యమున మృతదేహాన్ని తిరుపతి, మదనపల్లెకు తరలించిన అంబులెన్స్ డ్రైవర్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడానికి 4 ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ బృందాలు ఏపీ, గోవా, కర్ణాటక, తెలంగాణలో నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రిపై మరింత లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

ప్లాస్టిక్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణపై ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జెండా ఎగురవేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నియంత్రణపై చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మురికినీరు, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పడకుండా ఖచ్చితంగా పంచాయతీ అధికారులు నియమించిన చెత్త హుండీలలో వేయాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు బయట దొరికే ఫాస్ట్‌ఫుడ్ వంటి పదార్థాలను తినకూడదని, దీనివల్ల చిన్న వయస్సు నుంచి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. గ్రామల్లోని పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్మికులపై ప్రత్యేక దృష్టి పెట్టి చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకుండా పూర్తి స్థాయిలో డంపింగ్ యార్డుకు చేర్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో రాధమ్మ, తహసీల్దార్ క్రాంతికుమార్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఎంఈవో చక్రేనాయక్, ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండీ షఫీ నాయక్, ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య, మండల టీడీపీ యువజన నాయకులు పక్కీ రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

- ట్యాంకర్‌కు లీకేజీ.. యాసిడ్‌ను నిలువరించలేక
- రోడ్డు పక్కకు ట్యాంకర్ తరలింపు



ఘటనా స్థలంలో ట్యాంకర్ నుంచి లీకవుతున్న యాసిడ్

పీలేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శనివారం వేకువ జామున యాసిడ్ ట్యాంకరును టూరిస్టు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదం కారణంగా ట్యాంకరులోని ద్రవం లీకవడం, దానిని పెట్రోలుగా భావించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే అది పెట్రోలు కాదు, యాసిడ్ అని నిర్ధారణ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదు నుంచి తమిళనాడులోని వేలూరుకు యాసిడ్ తీసుకెళుతున్న ట్యాంకరును తూర్పుగోదావరి జిల్లా నుంచి అయ్యప్పస్వాములతో శబరిమలైకు వెళుతున్న ట్రావెల్స్ బస్సు ఉదయం 4.30 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాద తాకిడికి ట్యాంకరుకు లీకేజీ ఏర్పడడం, ఆ ట్యాంకరు నుంచి లీకవుతున్న ద్రవం ఘాటు వాసన కలిగి ఉండడం, కళ్లు మంటలు రావడంతో భయపడిన అయ్యప్పస్వాములు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే ట్యాంకరు లీకేజీని నిలువరించే అవకాశం లేకపోవడంతో యాసిడ్ పూర్తిగా ఖాళీ అయ్యేందుకు ట్యాంకరును అధికారులు రోడ్డు పక్కన ఉన్న బహిరంగ ప్రదేశానికి తరలించారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

పులివెందుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నరంగాపురంలో శుక్రవారం రాత్రి వంశీకృష్ణ యాదవ్‌ను కత్తితో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నిందితుడు పప్పూరి రవీంద్రను శనివారం ముద్దనూరు రింగురోడ్డులో అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా అవమానం జరగడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు రవీంద్ర తెలిపారన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిపై కేసు

నిమ్మనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లి దండ్రులను వేధిస్తున్న కుమారుడు, అతని భార్య, బంధువులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెంగంవారిపల్లి పంచాయతీ బండకిందహరిజనవాడ వాసి బిరసలపాటి యర్రప్పకు ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు దొరస్వామి ఉద్యోగ రిత్యా బయటి దేశంలో ఉన్నాడు. చిన్నకుమారుడు గౌరేంద్ర అదే గ్రామానికి చెందిన శ్రీదేవిని వివాహం చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా తల్లి సీతమ్మ, తండ్రి యర్రప్పను తనకు రావాల్సిన ఆస్తిని రాసివ్వాలంటూ వేధిస్తున్నాడని వాపోయారు. అలాగే బంధువులైన చంద్రమ్మ, వెంకట రమణారెడ్డి, వెర్రి రమణారెడ్డితో కలిసి తన ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు గౌరేంద్ర, శ్రీదేవి, బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలో రూ.2లక్షల మాయం

వాల్మీకిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి రూ.2లక్షలు మాయమైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు చింతపర్తి వాసి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ తెలుగు రైతు కార్యదర్శి కలికిరి సుధాకరరెడ్డికి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. అయితే శుక్ర, శనివారాల్లో తన ఖాతా నుంచి రూ.2లక్షలు నగదు మాయమైనట్లు శనివారం గుర్తించారు. శుక్రవారం ఐదు సార్లు, శనివారం ఆరుసార్లు తన ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా నగదు డ్రా చేసినట్లు గుర్తించి బ్యాంకు మేనేజర్, ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశాడు.

రైలుకింద పడి యువకుడు మృతి

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలుకింద పడి మహేష్ (26) అనే యువకుడు మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లావనూరు గ్రామానికి చెందిన రాయుడు కుమారుడైన మహేష్ శుక్రవారం రాత్రి లావనూరు నుంచి బస్సులో వచ్చి, కొండాపురం రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇతను ఇంటర్ వరకు చదువుకున్నాడని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ పక్షిని వేటాడిన వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న అటవీశాఖ అధికారులు

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె అటవీ శాఖ రేంజ్ పరిధి చక్రాయపేట మండలం ఫారెస్టు బీట్ కొండావాండ్లపల్లె సమీపంలో జాతీయపక్షి నెమలిని వేటాడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పాపాఘ్ని నది సమీపంలోని కొండవాండ్లపల్లె గ్రామం వద్ద నెమలిని వేటాడినట్లు సమాచారం రావడంతో డీఆర్వో వెంకటసుబ్బయ్య తనిఖీలు నిర్వహించారు. వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన మేదరి గంగన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వణ్యప్రాణి సంరక్షణ చట్టం కింద ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో షంషుద్దీన్

మైలవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలును తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 10వ తరగతిలో డి-గ్రేడ్ పిల్లలను ఎ,బి గ్రేడ్‌లు వచ్చేటట్లు, ఎ,బి గ్రేడ్ పిల్లలను అత్యుత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇటీవల ఢిల్లీ సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు వెళ్లి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెట్స్ క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన 9 తరగతి విద్యార్థులు నందిని, ముఖేష్‌లను డీఈవో అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి ర్యాంకులకు కృషి చేసిన ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిన్ననరసమ్మను సన్మానించారు. అలాగే వీవీఎం పోటీల్లో మొదటిస్థాయిలో విజయం సాధించిన 11 మంది ఆరవ తరగతి విద్యార్థులను కూడా డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ స్థలాలను పరిరక్షించాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విలువైన జిల్లా పరిషత్తు స్థలాల్లో వాణిజ్య సముదాయాల పేరుతో కబ్జాచేసేందుకు అధికారులు, అధికారపార్టీ నేతల యత్నాలను సాగనివ్వబోమని జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 16న జిల్లా పరిషత్ సీఈఓ పేరుతో నాగరాజుపేట వద్ద, ఆహార భవన్ పక్కన రెండు ఎకరాల జిల్లా పరిషత్తు స్థలంలో, కళాక్షేత్రం పక్కన ఏడు సెంట్ల స్థలంలో ఎవరైనా వాణిజ్య అవసరాల కోసం, కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటు కోసం వారు కోరిన విధంగా నిర్మించి కట్టబెట్టేందుకు పేపర్ ప్రకటన విడుదల చేసిందన్నారు. విడుదల చేసిన రెండు రోజులకే నాగరాజుపేట వద్ద ఉన్న రెండు ఎకరాలలో రూ.1,24,47,587 అంచనా వ్యయంతో నిర్మాణాలు, కళాక్షేత్రం వద్ద ఏడు సెంట్లలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి టెండర్లు పిలిచి అధికారపార్టీకి చెందిన వ్యక్తికి కట్టబెట్టారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ జిల్లా పరిషత్తు నియమ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న ఆరోపణలతో రద్దు చేసినట్లు సమాచారం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఒక ప్రైవేట్ కళాశాల యాజమాన్యంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్న అప్పటి సీఈఓ సుధాకర్‌రెడ్డి ఎలాంటి వేలం ప్రకటన లేకుండానే ఏకపక్షంగా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆందోళన చేపట్టిందన్నారు. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకున్న చందాన ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ అండదండలతో అధికారులను ప్రలోభపెట్టి విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా స్థలాల కేటాయింపు కోసం ప్రకటనలు, టెండర్లు పిలిచిన జడ్పీ సీఈఓ ఓబుళమ్మపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్లాస్మా ట్రీట్‌మెంట్‌తో అధిక దిగుబడి

- ఐఐఎస్‌సీ బెంగళూర్ ప్రొఫెసర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్మా ట్రీట్‌మెంట్ చేయడం ద్వారా పంటల దిగుబడి పెంచవచ్చని బెంగుళూర్ ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ బీఎస్ రజనీకాంత్ అన్నారు. శనివారం వైవీయూలో విత్తనాల ప్లాస్మా ట్రీట్‌మెంట్ అనే అంశంపై శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్ విద్యార్థులు ఐఐఎస్‌సీలో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నందుకు వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో జెనిటిక్స్ జీనోమిక్స్ హెడ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మునికుమారి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించగా డాక్టర్ రమేష్, డాక్టర్ ఎల్.దాక్షాయిని, డాక్టర్ పి.ఉస్మాన్‌బాష, మైక్రోబయలజీ హెడ్ డాక్టర్ శుభోష్‌చంద్ర సహకారం అందించారు. ఈ సెమినార్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ విజయరాఘవ ప్రసాద్, ప్రొఫెసర్లు, బోధన బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించండి



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

దువ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో ఓబుళమ్మ సూచించారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నీటి సరఫరాకు సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, లీకేజీలు ఉంటే నివారించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణయాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2600 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు మదనపల్లె డీవైఈఓ వై.లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా సమ్మిళిత విద్యాశాఖ అధికారి కొన్నిపాటి జనార్థన్ తెలిపారు. శనివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో 673 మంది భవిత కేంద్రాల్లో చదువుతున్న వారు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 2300 పాఠశాలలు, 30 భవిత కేంద్రాలున్నాయని, నియోజకవర్గానికి ఒక రోజు చొప్పున ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పిల్లలకు వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్లు, ట్రై సైకిల్స్, ఎంఆర్ కిట్స్ తదితర పరికరాలు అందజేసేందుకు ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గండి దేవస్థానంలో అభివృద్ధి పనుల పరిశీలన



అంజన్నను దర్శించుకుంటున్న గురుప్రసాద్

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానాన్ని శనివారం దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయనను సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజా రమేష్, గోపాలస్వామి సాదరంగా ఆహ్వానించి పూజలు చేశారు. అనంతరం ఆయన గండి దేవస్థానంలో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించారు. గుడి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగుల గురించి ఆరా తీశారు. మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, సూపరిం టెండెంట్ సుభాష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరాముని సన్నిధిలో భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్




కోదండరాముని సన్నిధిలో బద్రి

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్ బద్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం కోచ్ బద్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వివరించారు. ఆలయంలో శిల్పసంపద అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు. భారత సాఫ్ట్‌బాల్ టెక్నికల్ రెఫరీ నారాయణ, ఉమ్మడి కడప జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంక్షలు పేదలకు భారం కాకూడదు

- వైద్యాధికారులను ప్రశ్నించిన కాంగ్రెస్, సీపీఐ నాయకులు



స్కానింగ్‌ల నిర్వహణపై జిల్లా ఆస్పత్రి ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్యసేవల కోసం జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇక్కడి ఆంక్షలు భారం కాకూడదని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష, పట్టణాధ్యక్షుడు గోసంగి వెంకటసుబ్బారెడ్డి, సీపీఐ నాయకులు సుబ్బరాయుడు అన్నారు. శనివారం జిల్లా ఆస్పత్రిని సందర్శించిన వారు అక్కడికి వచ్చిన డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమశ్రీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతలకు ప్రజల సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలో అందని ద్రాక్షలా మారిన ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌ల నిర్వహణపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికల్లో శనివారం 'స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆస్పత్రిని సందర్శించి .. అక్కడి తీరుతెన్నులపై ప్రశ్నించారు. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు దాన్ని సవరించాలే తప్ప నిర్వీర్యం అయ్యేలా చేయడం ఎంతవరకు సబబు అన్నారు. సామాన్య ప్రజలు రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా సిటీ, ఎంఆర్ఐ సేవలు దక్కకపోవడం బాధాకరమైన విషయమన్నారు. రెండు రోజులపాటు అడ్మిట్ అయితే కానీ స్కానింగ్ రాస్తామని చెప్పేందుకు సంబంధించి రాత పూర్వక ఆదేశాలు ఉన్నాయా అంటూ నిలదీశారు. సామాన్యుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని నియమాలను సవరించి మెరుగైన వైద్యం అందరికి అందించే బాధ్యత వైద్యాధికారులతో పాటు ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం పేరిట రోగుల వద్ద నుంచి బహిరంగంగా రుసుము వసూలు చేయడమే కాక వాటికి సంబంధించిన రశీదులను కూడా ఇస్తున్నారని చెప్పారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐకి సంబంధించి ఫిల్మ్‌లను ప్రింట్‌లు వేసి అమ్ముకునే అనుమతులు ఎక్కడున్నాయో చూపించాలని నిలదీశారు. ప్రైవేటు సర్వీసులు, ఫిల్మ్‌ల అమ్మకాల పేరిట సుమారు రూ.7 కోట్లు డబ్బులు ఏ ప్రాతిపదిక మీద ప్రజల వద్ద నుంచి వసూలు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమశ్రీ మాట్లాడుతూ ఆస్పత్రిలో సేవలు పొందే రోగులకు నిర్వహించే వైద్య నిర్ధారణ పరీక్షల్లో వైద్యుల అవగాహన కోసం నివేదికలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, రోగుల చేతికి ఇవ్వాలన్న నిబంధన లేదని చెప్పారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ విభాగాల్లో పెయిడ్ సర్వీసులు కూడా ఉండడంతో ప్రింటింగ్ మిషన్ అనుమతిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టత తీసుకుంటామన్నారు. పేద ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఆస్పత్రి వైద్యులతో సమావేశమై తగిన సూచనలు జారీ చేస్తామన్నారు.

ఫసల్ సాంకేతికత రైతులకు ఎంతో ఉపయోగకరం

కడప రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఫసల్ సంస్థ అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు విశేషంగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు ప్రశంసించారని ఫసల్ టీమ్ స్టేట్ హెడ్ అనిల్‌నాయక్, టెరిటరీ మేనేజర్ విఘ్నేష్‌లు తెలిపారు. ఈ సాంకేతికతను ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విస్తృతంగా పరిచయం చేయాలని కలెక్టర్ సూచించారన్నారు. శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా ఫసల్ అభివృద్ధి చేసిన స్మార్ట్ వ్యవసాయ పరికరాల వినియోగం, వాటి ప్రయోజనాలు, ఉద్యాన పంటలు, కూరగాయపంటల్లో ఆటోమేటెడ్ ఇరిగేషన్-ఫర్టిగేషన్ సిస్టమ్‌ల అమలు విధానాలపై సమగ్రంగా వివరించామన్నారు. అలాగే మట్టితేమ, ఉష్ణోగ్రత, ఆర్ద్రత, ఆకుతేమ తదితర కీలక సమాచారాన్ని రైతులకు తెలియజేసి శాస్త్రీయ సాగు నిర్ణయాలు తీసుకునేలా సహకరిస్తున్న ఫసల్ సాంకేతికత ప్రయోజనాలను కలెక్టర్‌కు తెలియపరిచామన్నారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తరి గొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివా రం స్వామి వారికి అర్చకులు విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యే కంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వా రికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం చేయూత

● క్రీడా సామగ్రికి రూ. 7.40 కోట్లు మంజూరు ● 432 మంది క్రీడాకారులకు ఉద్యోగాలు ● ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు


ప్రసంగిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

రైల్వేకోడూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రభుత్వం చేయూత నిస్తోందని ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు తెలిపారు. శనివారం రైల్వేకోడూరు జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 416 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ కల్గిన 432 మంది క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ తో ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. క్రీడాకారులకు రవాణా, యూనిఫాం, వసతి, భోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సమగ్ర శిక్షణ కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా సామగ్రి కోసం రూ. 7.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. నైపుణ్యం కల్గిన క్రీడాకారులను వెలికితీసి జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నామని , అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 29, 30 తేదీల్లో మండల స్థాయి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి కమిటీ సభ్యులు మంచి జట్లను ఎంపిక చేస్తే అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని తెలిపారు.ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ రైల్వేకోడూరులో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించాలని ఎస్జీఎఫ్‌కు తెలిపారన్నారు. 2026 జనవరిలో ఈ పోటీలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. క్రీడాకారులను గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లెల రమేష్‌బాబు, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, రైల్వేకోడూరు అర్బన్ సీఐ కే. హేమసుందర్‌రావు, ఎంఈవో-2 సుందర్‌బాబు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలు సోమవారం వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లో ఎస్జీఎఫ్ జిల్లా అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రమోహన్‌రాజు, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోధర, పీడీ సీ. శారద, మాజీ పీడీ సుబ్బరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

రాయచోటి నేతాజీ సర్కిల్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల వ్యాప్తంగా 17 నుంచి 26వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. 6 సంవత్సరాల లోపు పిల్లలకు కొత్త ఆధార్‌కార్డు నమోదు, 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు వేలి ముద్రల అప్‌డేట్, ఆధార్‌లో చిరునామా, ఫొటో మా ర్పులు, ఫోన్ నెంబరు, లింక్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో అంగ న్వాడీ కేంద్రాలు, కళాశాలలు, స్కూల్స్ లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయనున్నట్లు వివరించారు. దేవపట్ల, శెట్టిపల్లె, సంబేపల్లె పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిల్లలకు సంబంధించిన ఆధార్‌పై స్పందించాలని తెలియజేశారు. ఇందుకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలన్నారు.

పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షుడుగా వీరబల్లి వెంకట్రమణ



లక్కిరెడ్డిపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వీరబల్లి వెంకట్రమణ తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో జనరల్ సెక్రటరీగా నల్లబల్ల శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కా రంపై ప్రభుత్వాలతో పోరాడుతామన్నారు.

రైల్వేకోడూరు ఏడీఈగా ప్రియదర్శన్‌రెడ్డి



రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు ఏడీఈగా ప్రియదర్శన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రైతులు, విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉంటానని, విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పని వేళలు పాటించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


సంబేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత తో పాటు పర్యా వరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతో మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, నర్సులు, శానిటేషన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : బాకరాపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం లక్ష్మీకేసమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి కాలుష్య నివారణకు పాటుపడాలని సూచించారు. పీడీ రామచంద్రయ్య, పంచాయతి సెక్రటరీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి నేతాజీ సర్కిల్: సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ నేత కందూరి నాగేశ్వర్‌నాయుడు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధి , వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు ఖాజామొహిద్దీన్, ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు.

సిద్దవటం: ఎగువపేటలోని నలందా హైస్కూల్లో విద్యార్థులు మొక్కలు నాటారు. గొల్లపల్లె, చలమారెడ్డి కొట్టాలు, ఎస్.రాజంపేట గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేసి అటవీ చట్టాలు, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ పై సిద్దవటం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ కె.ఓబులేశు అవగాహన కల్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న సాయి లోకేశ్

ఓబులవారిపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ చొరవతో అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి తెలిపారు.


మండలంలోని చిన్నంపల్లె పంచాయతీ లింగిరెడ్డిపల్లెలోని అయ్యపతి సుబ్బమ్మకు రూ.43 వేలు, గద్దలరేవుపల్లె పంచాయతీలో పండేటి రాజేష్ కుమార్తె యశ్వితకు రూ.40 వేలు వారి ఇళ్లకు వెళ్లి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేష్ రెడ్డి, సీనియర్ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, అక్కమ్మగారి శంకరయ్య, నరేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


అరవీడు జగనన్న కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గాలివీడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అరవీడు గ్రామ పరిధిలోని జగనన్న కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వారు కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సుమారు 100 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించినా, మౌలిక వసతులు కల్పించకపోవడంతో పేదలు ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం కాలనీలో రహదారి, వీధి దీపాలు, సిమెంటు రోడ్లు, మంచినీటి సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ చుట్టూ పంట పొలాల కారణంగా విషపురుగుల బెడద పెరిగిందని, తాగునీటి కోసం ట్యాంకర్ నీటికి రూ.1000 చెల్లించాల్సిన దుస్థితి నెలకొన్నట్లు తెలిపారు. కనీసం బస్సు స్టేజ్ కూడా లేకపోవడంతో ప్రయాణం కష్టసాధ్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించి, ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మండెం సుధీర్ కుమార్, గాలివీడు మండల నేతలు వీరభద్ర, వెంకట్రమణ పాల్గొన్నారు.

కొత్తకోడూరులో విగ్రహాల ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న పండితులు

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తకోడూరులో శివుడు, నంది, నాగమ్మ విగ్రహాలను శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపండితులు హోమాలు, పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జగత్పతిశర్మ, ప్రదీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన


ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు

చిన్నమండెం,నవంబరు15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు రెడ్డి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ ఉద్యోగి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ గ్రంథాలయంలో ఉన్న అరుదైన పుస్తకాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చదువుతున్నారన్నారు. పుస్తక పఠనం అనేది విద్యార్థులకు ఉండవల్సిన ప్రధాన లక్షణమని, నేటి సమాజంలో పిల్లలు సోషల్ మీద మీద ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్నారు. పుస్తక పఠనం ఒక అలవర్చుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

రాజంపేట టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమి గ్రాండ్‌మాస్టర్ బి.సునీల్ పేర్కొన్నారు. ద్రోణాచార్య అకాడమి ఆధ్వర్యంలో శనివారం జీఎంసీ క్లబ్ ఆవరణలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్‌లో 19 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో వెంకట్‌వినయ్‌కుమార్ రెడ్ బెల్ట్ సాధించగా మిగిలిన 18 మంది వివిధ గ్రేడుల్లో అర్హత సాధించారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి క్రీడల్లో రాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమి ఉపాధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహా, సంయుక్త కార్యదర్శి మందా శివయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్లు అందజేత


కుమ్మరపల్లి పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న కోటిరెడ్డి

రామాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుమ్మరపల్లి, సూరకవాండ్లపల్లె పాఠ శాలలకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు నంద లూరు కోటి రెడ్డి శనివారం 5 కంప్యూటర్లను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అధిక శాతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారని, ప్రతి ఒక్కరూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముందుకు రావాలని కోరారు. కుమ్మరపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థాయిల్లో ఉత్తీర్ణత సాధిస్తే 30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 20 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తామని ప్రకటించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి కుమ్మరపల్లి పాఠశాలలోని విద్యార్థులు క్రీడల్లో జిల్లా స్థాయిలో రాణిస్తే వారికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, నాగబసి రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణనాయక్, ఉపాధ్యాయులు రమాకాంత్, మల్లికార్జున, కృష్ణయ్య, మస్తాన్, సుభాన్, నాగేంద్ర, భాస్కర్, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలపై చర్చలు సఫలం


పారిశుధ్య కార్మికుల తరపున మాట్లాడుతున్న దాసరి జయచంద్ర

రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల జీతాలపై పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీ సర్ వరప్రసాద్ రావు కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం రెండు నెలల జీతాలు చెల్లిస్తామని తెలిపారు. ఈ నెలాఖరుకు మిగిలిన మొత్తం కూడా చెల్లిస్తామని వివరించారు. జీతాలు చెల్లించకుంటే మాత్రం ఆందోళన లు చేస్తామని కార్మిక సంఘం నాయకుడు దాసరి జయచంద్ర తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న బోళాశంకర్ సమితి సభ్యులు

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బోళాశంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నరసరాంపేటకు చెందిన మల్లెల సుబ్రహ్మణ్యం, నాగమణి కుమారుడు మురళీసింహనాథ్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోళాశంకర్ సేవా సమితి అధ్యక్షుడు మండల నాగేంద్ర, సభ్యులు సీహెచ్ రమేష్‌బాబు, వాసా బాబు, రాజేశ్వరి, సుబ్రహ్మణ్యం, రత్తయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వేపై అవగాహన


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి శేఖర్‌రెడ్డి

సుండుపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి సర్వేను ఈ నెల 17వ తేదీ నుంచి 31 వరకు నిర్వహిం చాలని వైద్యాధికారి శేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సర్వే చేసి స్పర్శ లేని వారిని గుర్తించి ఎర్రని రాగి మచ్చలు ఉంటే వెంటనే వైద్యం పొందేలా సూచించాలన్నారు. సకాలంలో గుర్తిస్తే కేవలం 6 నుంచి 9 నెలలలోపు కుష్ఠు వ్యాధిని నయం చేయవచ్చునన్నారు, లేనిచో అంగవైకల్యం వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా సర్వే చేసి నివేదికను పై అధికారులకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో వీరనారాయణ, వైద్య సిబ్బంద పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ హేమసుందర్

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిపై వాహనాలను నిలుపుతున్న ఆటో, జీప్ యజమానులపై కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు సిఐ కే.హేమసుందర్ రావు తెలిపారు. శనివారం కోడూరు పట్టణంలోని చిట్వేల్ రోడ్డులో ఉన్న బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి వద్ద వాహనాలు నిలుపుతున్న ఆటో, జీప్ డ్రైవర్లకు కోడూరు పోలీస్‌స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో డ్రైవర్లను హెచ్చరించినా వారు వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి అక్కడ వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు.

మహనీయుడు బిర్సాముండా


బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సాముండా అని మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తెలిపారు. రైల్వే కోడూరు బీజేపీ కార్యాలయంలో శనివారం బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వాకచర్ల సుబ్బారావు, జిల్లా కిసాన్ మోర్చా మాజీ అధ్యక్షుడు జయ ప్రకాష్‌నారాయణవర్మ, సీనియర్ నాయకులు పందేటి శంకర్‌రాజు, మహిళా నాయకురాలు కుప్పాల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి కాశప్పగారి రాము, నాయకులు కుప్పాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వరంగ బ్యాంకుల సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవా లని విడ్స్ సంస్థ కౌన్సిలర్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు ద్వారా అందించే పథకాలను ఎన్ఎస్ ఎస్ కార్యక్రమంలో భాగంగా అనంతరాజుపేట హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులకు వివరించారు. పదేళ్లకు పైబడిన బ్యాంకు ఖాతాలోని నగదును ఉపసంహరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవ కాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్ పథకాలు, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కల్పించారు.

సతీష్ కుమార్ మృతిపై విచారణ ముమ్మరం చేయాలి..

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ ముమ్మరం చేసి నేరస్తులను చట్టం ముందు నిలబెట్టాలని రైల్వేకోడూరు శాలివాహన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు.

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

- ట్యాంకర్‌కు లీకేజీ.. యాసిడ్‌ను నిలువరించలేక
- రోడ్డు పక్కకు ట్యాంకర్ తరలింపు



ఘటనా స్థలంలో ట్యాంకర్ నుంచి లీకవుతున్న యాసిడ్

పీలేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శనివారం వేకువజామున యాసిడ్ ట్యాంకరును టూరిస్టు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదం కారణంగా ట్యాంకరులోని ద్రవం లీకవడం, దానిని పెట్రోలుగా భావించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే అది పెట్రోలు కాదు, యాసిడ్ అని నిర్ధారణ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదు నుంచి తమిళనాడులోని వేలూరుకు యాసిడ్ తీసుకెళుతున్న ట్యాంకరును తూర్పుగోదావరి జిల్లా నుంచి అయ్యప్పస్వాములతో శబరిమలైకు వెళుతున్న ట్రావెల్స్ బస్సు ఉదయం 4.30 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాద తాకిడికి ట్యాంకరుకు లీకేజీ ఏర్పడడం, ఆ ట్యాంకరు నుంచి లీకవుతున్న ద్రవం ఘాటు వాసన కలిగి ఉండడం, కళ్లు మంటలు రావడంతో భయపడిన అయ్యప్పస్వాములు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే ట్యాంకరు లీకేజీని నిలువరించే అవకాశం లేకపోవడంతో యాసిడ్ పూర్తిగా ఖాళీ అయ్యేందుకు ట్యాంకరును అధికారులు రోడ్డు పక్కన ఉన్న బహిరంగ ప్రదేశానికి తరలించారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

పులివెందుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నరంగాపురంలో శుక్రవారం రాత్రి వంశీకృష్ణ యాదవ్‌ను కత్తితో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నిందితుడు పప్పూరి రవీంద్రను శనివారం ముద్దనూరు రింగురోడ్డులో అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా అవమానం జరగడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు రవీంద్ర తెలిపారన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిపై కేసు

నిమ్మనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లి దండ్రులను వేధిస్తున్న కుమారుడు, అతని భార్య, బంధువులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెంగంవారిపల్లి పంచాయతీ బండకిందహరిజనవాడ వాసి బిరసలపాటి యర్రప్పకు ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు దొరస్వామి ఉద్యోగరీత్యా బయటి దేశంలో ఉన్నాడు. చిన్నకుమారుడు గౌరేంద్ర అదే గ్రామానికి చెందిన శ్రీదేవిని వివాహం చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా తల్లి సీతమ్మ, తండ్రి యర్రప్పను తనకు రావాల్సిన ఆస్తిని రాసివ్వాలంటూ వేధిస్తున్నాడని వాపోయారు. అలాగే బంధువులైన చంద్రమ్మ, వెంకట రమణారెడ్డి, వెర్రి రమణారెడ్డితో కలిసి తన ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు గౌరేంద్ర, శ్రీదేవి, బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలో రూ.2లక్షల మాయం

వాల్మీకిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి రూ.2లక్షలు మాయమైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు చింతపర్తి వాసి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ తెలుగు రైతు కార్యదర్శి కలికిరి సుధాకర్‌రెడ్డికి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. అయితే శుక్ర, శనివారాల్లో తన ఖాతా నుంచి రూ.2లక్షలు నగదు మాయమైనట్లు శనివారం గుర్తించారు. శుక్రవారం ఐదు సార్లు, శనివారం ఆరుసార్లు తన ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా నగదు డ్రా చేసినట్లు గుర్తించి బ్యాంకు మేనేజర్, ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశాడు.

రైలుకింద పడి యువకుడు మృతి

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలుకింద పడి మహేష్ (26) అనే యువకుడు మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లావనూరు గ్రామానికి చెందిన రాయుడు కుమారుడైన మహేష్ శుక్రవారం రాత్రి లావనూరు నుంచి బస్సులో వచ్చి, కొండాపురం రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇతను ఇంటర్ వరకు చదువుకున్నాడని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ పక్షిని వేటాడిన వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న అటవీశాఖ అధికారులు

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె అటవీ శాఖ రేంజ్ పరిధి చక్రాయపేట మండలం ఫారెస్టు బీట్ కొండావాండ్లపల్లె సమీపంలో జాతీయపక్షి నెమలిని వేటాడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పాపాఘ్ని నది సమీపంలోని కొండవాండ్లపల్లె గ్రామం వద్ద నెమలిని వేటాడినట్లు సమాచారం రావడంతో డీఆర్వో వెంకటసుబ్బయ్య తనిఖీలు నిర్వహించారు. వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన మేదరి గంగన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- కలికిరిలో ఉద్రిక్తత
- స్నేహితులే కొట్టి చంపేశారని తల్లిదండ్రులు, బంధువుల నిరసన
- ఎట్టకేలకు మీడియా ముందు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు



హత్య కేసు నమోదు చేయనందుకు నిరసనగా స్టేషన్ ముందు బాధితుల ధర్నా



ఘటనా స్థలం వద్ద మృతదేహం



మృతుడు వినీత్‌కుమార్ రాజు (ఫైల్)



మీడియా ముందు రోదిస్తున్న వినీత్ తల్లి సుకన్య

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువకుడి మృతి అనుమానాస్పదంగా వుందన్న ఆరోపణలతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుస్టేషను ముందు బాధిత కుటుంబీకులు, బంధువుల ఆందోళనతో అట్టుడికింది. సీఐ అనిల్‌కుమార్ మీడియా ఎదుట తెలిపిన వివరాలిలా..

మృతుడు వినీత్‌కుమార్‌రాజు (25) స్థానిక అబూ మొబైల్స్‌లో పనిచేస్తుండేవాడు. షాపు యజమాని అబూ తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా పార్టీ ఇచ్చేందుకు శుక్రవారం రాత్రి తన మిత్రులు బబ్లూ, నరేష్, అహ్మద్‌లతో పాటు మృతుడు వినీత్‌ను కూడా ఆహ్వానించారు. ప్రత్యేక చికెన్ వంటకాల కోసం వీరందరూ కారులో రాయచోటికి వెళ్లారు. కారు యజమాని బబ్లూ డ్రైవింగ్‌లో వుండగా, అందరూ పీకలదాకా మద్యం సేవించారు. రాత్రి 12.30 గంటల సమయంలో కలికిరికి చేరుకుని అబూ, అహ్మద్‌లను క్రాస్‌రోడ్డు అబూ మొబైల్స్ వద్ద దించేసి, తిమ్మారెడ్డి మాదిగపల్లెలో నరేష్‌ను, సత్యాపురంలో వినీత్‌ను దించేందుకు వెళ్లాడు. కాగా సత్యాపురం వద్ద దించిన వినీత్‌ను బబ్లూ కారుతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్ధరాత్రి 3 గంటల సమయంలో సత్యాపురం వద్ద రోడ్డుపై పడి వున్న వినీత్‌ను గుర్తించారు. వెంటనే పోలీసులు బబ్లూ, అబూ, అహ్మద్, నరేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వినీత్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన జరిగిన 18 గంటల తరువాత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

స్నేహితులే కొట్టి చంపేశారు

తమ బిడ్డను అబూ, బబ్లూ, అహ్మద్, నరేష్‌లే కొట్టి హింసించి చంపేసినట్లు అన్ని ఆధారాలున్నాయని మృతుడి తల్లిదండ్రులు రామకృష్ణరాజు, సుకన్యలు మీడియా ఎదుట వాపోయారు. తాము స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు ఇస్తున్నా పోలీసులు తీసుకోవడం లేదని, అనుమానాస్పద మృతిగా రాసివ్వాలని వత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. కాగా కుటుంబీకులు, బంధువులు, పలువురు ప్రజలు పోలీసుస్టేషన్ ముందు నిరసనకు దిగారు. ఫలితంగా కొద్దిసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. సీఐ అనిల్‌కుమార్ నచ్చచెప్పి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అయిన కుటుంబీకులు మాత్రం హత్య కేసుగా నమోదు చేయాలని వాగ్వాదానికి దిగారు.

పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చేంత వరకూ అనుమానిత మరణమే

శవపరీక్ష నివేదిక వచ్చేంత వరకూ వినీత్ రాజు మృతి కేసు అనుమానాస్పద మరణమేనని పోలీసులు స్పష్టం చేశారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో హత్యగా కేసు నమోదు చేయాలని మృతుని బంధువులు ధర్నాకు దిగారు. ప్రస్తుతానికి అనుమానిత కేసుగా నమోదు చేస్తున్నా పీఎం నివేదికనుబట్టి కేసు దర్యాప్తు వుంటుందని హామీ ఇచ్చారు.

ప్లాస్మా ట్రీట్‌మెంట్‌తో అధిక దిగుబడి

- ఐఐఎస్‌సీ బెంగళూర్ ప్రొఫెసర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్మా ట్రీట్‌మెంట్ చేయడం ద్వారా పంటల దిగుబడి పెంచవచ్చని బెంగుళూర్ ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ బీఎస్ రజనీకాంత్ అన్నారు. శనివారం వైవీయూలో విత్తనాల ప్లాస్మా ట్రీట్‌మెంట్ అనే అంశంపై శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్ విద్యార్థులు ఐఐఎస్‌సీలో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నందుకు వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో జెనిటిక్స్ జీనోమిక్స్ హెడ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మునికుమారి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించగా డాక్టర్ రమేష్, డాక్టర్ ఎల్.దాక్షాయిని, డాక్టర్ పి.ఉస్మాన్‌బాష, మైక్రోబయలజీ హెడ్ డాక్టర్ శుభోష్‌చంద్ర సహకారం అందించారు. ఈ సెమినార్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ విజయరాఘవ ప్రసాద్, ప్రొఫెసర్లు, బోధన బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండరాముని సన్నిధిలో భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్



కోదండరాముని సన్నిధిలో బద్రి

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్ బద్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం కోచ్ బద్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వివరించారు. ఆలయంలో శిల్పసంపద అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు. భారత సాఫ్ట్‌బాల్ టెక్నికల్ రెఫరీ నారాయణ, ఉమ్మడి కడప జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గండి దేవస్థానంలో అభివృద్ధి పనుల పరిశీలన



అంజన్నను దర్శించుకుంటున్న గురుప్రసాద్

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానాన్ని శనివారం దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయనను సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజా రమేష్, గోపాలస్వామి సాదరంగా ఆహ్వానించి పూజలు చేశారు. అనంతరం ఆయన గండి దేవస్థానంలో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించారు. గుడి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగుల గురించి ఆరా తీశారు. మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, సూపరింటెండెంట్ సుభాష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించండి

దువ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ సూచించారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నీటి సరఫరాకు సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, లీకేజీలు ఉంటే నివారించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణయాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ఫసల్ సాంకేతికత ఎంతో ఉపయోగకరం

కడప రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఫసల్ సంస్థ అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు విశేషంగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు ప్రసంసించారని ఫసల్ టీమ్ స్టేట్ హెడ్ అనిల్‌నాయక్, టెరిటరీ మేనేజర్ విఘ్నేష్‌లు తెలిపారు. ఈ సాంకేతికతను ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విస్తృతంగా పరిచయం చేయాలని కలెక్టర్ సూచించారన్నారు. శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా ఫసల్ అభివృద్ధి చేసిన స్మార్ట్ వ్యవసాయ పరికరాల వినియోగం, వాటి ప్రయోజనాలు, ఉద్యాన పంటలు, కూరగాయపంటల్లో ఆటోమేటెడ్ ఇరిగేషన్-ఫర్టిగేషన్ సిస్టమ్‌ల అమలు విధానాలపై సమగ్రంగా వివరించామన్నారు. అలాగే మట్టితేమ, ఉష్ణోగ్రత, ఆర్ద్రత, ఆకుతేమ తదితర కీలక సమాచారాన్ని రైతులకు తెలియజేసి శాస్త్రీయ సాగు నిర్ణయాలు తీసుకునేలా సహకరిస్తున్న ఫసల్ సాంకేతికత ప్రయోజనాలను కలెక్టర్‌కు తెలియపరిచామన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2600 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు మదనపల్లె డీవైఈఓ వై.లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా సమ్మిళిత విద్యాశాఖ అధికారి కొన్నిపాటి జనార్ధన్ తెలిపారు. శనివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో 673 మంది భవిత కేంద్రాల్లో చదువుతున్న వారు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 2300 పాఠశాలలు, 30 భవిత కేంద్రాలున్నాయని, నియోజకవర్గానికి ఒక రోజు చొప్పున ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పిల్లలకు వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్లు, ట్రై సైకిల్స్, ఎంఆర్ కిట్స్ తదితర పరికరాలు అందజేసేందుకు ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో షంషుద్దీన్

మైలవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలును తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 10వ తరగతిలో డి-గ్రేడ్ పిల్లలను ఎబి గ్రేడ్‌లు వచ్చేటట్లు, ఎబి గ్రేడ్ పిల్లలను అత్యుత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇటీవల ఢిల్లీ సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు వెళ్లి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెట్స్ క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన 9 తరగతి విద్యార్థులు నందిని, ముఖేష్‌లను డీఈవో అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి ర్యాంకులకు కృషి చేసిన ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిన్ననరసమ్మను సన్మానించారు. అలాగే వీవీఎం పోటీల్లో మొదటిస్థాయిలో విజయం సాధించిన 11 మంది ఆరవ తరగతి విద్యార్థులను కూడా డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ స్థలాలను పరిరక్షించాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విలువైన జిల్లా పరిషత్తు స్థలాల్లో వాణిజ్య సముదాయాల పేరుతో కబ్జాచేసేందుకు అధికారులు, అధికారపార్టీ నేతల యత్నాలను సాగనివ్వబోమని జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 16న జిల్లా పరిషత్ సీఈఓ పేరుతో నాగరాజుపేట వద్ద, ఆహార భవన్ పక్కన రెండు ఎకరాల జిల్లా పరిషత్తు స్థలంలో, కళాక్షేత్రం పక్కన ఏడు సెంట్ల స్థలంలో ఎవరైనా వాణిజ్య అవసరాల కోసం, కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటు కోసం వారు కోరిన విధంగా నిర్మించి కట్టిబెట్టేందుకు పేపర్ ప్రకటన విడుదల చేసిందన్నారు. విడుదల చేసిన రెండు రోజులకే నాగరాజు పేట వద్ద ఉన్న రెండు ఎకరాలలో రూ.1,24,47,587 అంచనా వ్యయంతో నిర్మాణాలు, కళాక్షేత్రం వద్ద ఏడు సెంట్లలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి టెండర్లు పిలిచి అధికార పార్టీకి చెందిన వ్యక్తికి కట్టబెట్టారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ జిల్లా పరిషత్తు నియమ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న ఆరోపణలతో రద్దు చేసినట్లు సమాచారం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఒక ప్రైవేట్ కళాశాల యాజమాన్యంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్న అప్పటి సీఈఓ సుధాకర్ రెడ్డి ఎలాంటి వేలం ప్రకటన లేకుండానే ఏకపక్షంగా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆందోళన చేపట్టిందన్నారు. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకున్న చందాన ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ అండదండలతో అధికారులను ప్రలోభపెట్టి విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాల కేటాయింపు కోసం ప్రకటనలు, టెండర్లు పిలిచిన జడ్పీ సీఈఓ ఓబులమ్మపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

ఏకపక్షంగా చేతులెత్తిన ఎంపీటీసీ సభ్యులు

బి.కొత్తకోట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆమె తన పదవిని కోల్పోయారు. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులందరూ ఏకమై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో లక్ష్మీనరసమ్మ స్థానంలో మరొకరికి ఖాయమైంది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలూ అప్పట్లో అధికారంలో వున్న వైసీపీ ఖాతాలోకి వెళ్లాయి. వీరిలో ఎస్సీ రిజర్వు స్థానమైన గుమ్మసముద్రం నుంచి ఎన్నికైన లక్ష్మీనరసమ్మను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 10 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీని వ్యతిరేకించారు. ఎంపీపీపై తమకు విశ్వాసం లేదని, ఆమె తమ అభిప్రాయాలను గౌరవించడం లేదని ఓ మండలమీట్‌లో అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తి అయ్యే వరకు అవిశ్వాసం చెల్లదన్న నిబంధనల మేరకు ఈ సెప్టెంబరు వరకు వేచి వుండాల్సి వచ్చింది. నాలుగేళ్లు పూర్తవడంతో ఎంపీటీసీలు మరోసారి ఈ విషయమై ఉన్నతాధికారులను కలిశారు. దీంతో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ సహా సభ్యులందరికీ 14న హాజరు కావాల్సిందిగా నోటీసులు అందించారు. శుక్రవారం మదనపల్లి సబ్‌కలెక్టర్ కళ్యాణి బి.కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని అవిశ్వాస తీర్మాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తీర్మానానికి అనుకూలంగా వున్న వారు చేతులు ఎత్తాలని కోరారు. దీంతో హాజరైన 10 మంది చేతులెత్తారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని, ఈ విషయమై కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. తదుపరి చర్యలు కలెక్టర్ ఆదేశాల మేరకు ఉంటాయన్నారు. కాగా ఎంపీపీ లక్ష్మీనరసమ్మ హాజరు కాలేదు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సహా డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, ఎంపీడీఓ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థులు

తంబళ్లపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల బాలుర పాఠశాల, మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, అండర్-19 నెట్ బాల్ క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. 12,13 తేదీల్లో విశాఖపట్టణంలో నిర్వహించిన 2025-26 జన జాతీయ గౌరవ్ వర్ష్ పక్వాడ స్పోర్ట్స్ మీట్ స్వాభిమాన ఉత్సవాల్లో గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి బి.సాయి నాయక్ వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థి గౌస్ అహమ్మద్ ఇటీవల సీటీఎంలో నిర్వహించిన అంగర్-19 నెట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటినట్లు తెలిపారు. ఈ విద్యార్థి 16,17 తేదీల్లో ఏలూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ బాబు, జిల్లా సెక్రటరీ నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, పీడీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వర్ణపంచాయతీ యాప్‌లోనే పన్నులు చెల్లించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటిపన్ను, పన్నేతర వసూళ్లను స్వర్ణపంచాయతీ యాప్ ద్వారానే డిజిటల్ చెల్లింపులు జరపాలని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా పన్నులు వసూలు చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారన్నారు. దీనిపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్‌లు, వాట్సప్ సందేశాలు జారీ చేశామన్నారు. ఈమేరకు ప్రతి పంచాయతీ కార్యదర్శి నుంచి ధృవీకరణ పత్రం తీసుకుంటున్నామన్నారు. ప్రతి మండలంలోనూ డిప్యూటీ ఎంపీడీఓలు స్వర్ణపంచాయతీ యాప్ అమలును పర్యవేక్షించాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించి పీఆర్-1యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇలా చేయని కార్యదర్శులపై శాఖాపర చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ హెచ్చరించారు.

ఘనంగా ఆంజనేయస్వామికి ఆకుపూజ

పెద్దతిప్పసముద్రం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం పురస్కరించుకుని విశేషపూజలు చేశారు. ఉదయం నవగ్రహాలకు అభిషేకాలు, శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులచే ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామి వారికి ఆకుపూజ, తోమాల, వడమాల కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పంచాయతీలు శుభ్రతను పాటించాలి : డీఎల్‌పీఓ నాగరాజ ● స్వర్ణ ఆంధ్ర ర్యాలీ, మానవహారం



నిమ్మనపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ, అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు శుభ్రతను పాటించాలని డీఎల్‌పీఓ నాగరాజ, ఏఓ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛఆంధ్ర... స్వచ్ఛదివస్‌లో భాగంగా అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వర్షపు నీటి నిల్వలు లేకుండా, రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ-1 పద్మావతి, కార్యదర్శి నాగరాజు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత బాధ్యత

పెద్దతిప్పసముద్రం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నుంచి మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. పీటీఎం బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఎంఈఓ నారాయణ, ఏపీఎం హరి, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం అంటూ విద్యార్థులు



పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల శ్రమదానం

పెద్దమండ్యం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో మేము సైతమని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాలు పంచుకున్నారు. పాఠశాలల పరిసరాల్లో వున్న చెత్త చెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. పాఠశాలల శుభ్రతపై ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవా గుణం అలవాటవుతుందని ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ విమలకుమారి, కార్యదర్శులు పలువురు పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

తంబళ్లపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ బాపూజీ పట్నాయక్ సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో...

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని టీడీపీ జిల్లా కార్యదర్శి కోటపల్లె బాబురెడ్డి, పీలేరు ఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో శుభ్రతపై అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, టీడీపీ నేతలు సురేంద్ర, చాన్ బాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో ర్యాలీ

పరిశుభ్రతను పాటించాలి

గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. నేతలు, అధికారులు, పాల్గొన్నారు.

ముక్కుపుటాలదిరే....

● రహదారిపై నల్లటి ముద్దలు
● దుర్వాసనతో అల్లాడిన జనం





రహదారిపై టిప్పర్ల నుంచి పడిన ముద్దలు - పీవీసీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం సమయాన దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ముక్కుపుటాలదిరే దుర్వాసనతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం సరిగ్గా పాఠశాల విద్యార్థులు భోజనం తినేసమయంలో తిరుపతి వైపు నుంచి మదనపల్లె వైపు మూడు టిప్పర్లు పట్టణం గుండా వెళ్లాయి. ఆ టిప్పర్లలో ఏమి తీసుకెళ్లారో తెలియదు కానీ తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంకు మొదలు వెంగమాంబ ఆర్చి, ఆర్టీసీ బస్టాండ్, ఎల్ఆర్ స్ట్రీట్, గాంధీ బస్టాండ్, జూనియర్ కాలేజ్ రోడ్డు, రైల్వేస్టేషన్ వరకు రోడ్డుపై కుప్పలు కుప్పలుగా నల్లటి ముద్దలు టిప్పర్ల నుంచి జారిపడ్డాయి. దీంతో వెలువడిన దుర్గంధం తీవ్ర ఇబ్బందికి గురి చేసింది. ఆ కుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో తట్టుకోలేక దుకాణ సముదాయాలు మూత పడగా, పాదచారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు దుర్వాసన వల్ల ఇబ్బందులకు గురై తరగతి గదులకు పరుగులు తీశారు. టిప్పర్లలో ఎక్కడి నుంచి ఏమి తరలించారో తెలియదు కానీ పట్టణం మొత్తం సాయంత్రం దాకా దుర్వాసనను ప్రజలు భరించలేకపోయారు. దీనిపై ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. పట్టణ ప్రముఖులు ప్రశ్నించడంతో పంచాయతీ అధికారులు సుమారు 10 ట్యాంకర్ల నీటితో రోడ్డును కడిగినా దుర్గంధం పోలేదంటే అతిశయోక్తి కాదు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పీలేరు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి శనివారం తెలిపారు. పీలేరు పాత బస్టాండులోని తమ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, ఆపరేషన్‌కు ఎంపికైన వారిని ఆదివారం సాయంత్రమే తిరుపతికి తీసుకెళతారన్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారు తప్పనిసరిగా హెల్త్ కార్డు, ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులు వెంట తేవాలన్నారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయ అధికారి వసంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి సమాజంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ శివశంకర నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప, టీడీపీ నేతలు శ్రీరామ సహదేవ నాయుడు, బీదం గురునాథ్ యాదవ్, బెల్లె రెడ్డిప్రసాద్, మంచూరు గురు, గ్రంథాలయ సిబ్బంది జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కలకడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువులో రాణించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని లైబ్రేరియన్ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. నవలలు, కథలు, జనరల్ నాలెడ్జ్, ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ గ్రంథాలయానికి వెళ్లాలి

కలికిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ గంథాలయంలో కొద్దిసేపు సమయం కేటాయించాలని ఎంఈఓ సురేష్ కోరారు. గ్రంథాలయాలకు విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సురేష్, ఉపాధ్యాయులు ప్రభాకర్, సీఆర్పీ సురేష్, విద్యార్థులు హాజరయ్యారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని పెం పొందించే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవడంతో మంచి విజ్ఞానాన్ని పొందవచ్చన్నా రు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

పీలేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శాఖా గ్రంథాల యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. గ్రంథాలయంలో వివిధ పుస్తకాల పుస్తకాల గురించి ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, చరిత్ర, వర్తమాన అంశాల గురించి సమగ్ర అవగాహన చేసుకునేందుకు తరచూ గ్రంథాలయాన్ని సందర్శించాలని లైబ్రేరియన్ అమరనాథ్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల హెచ్ఎం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పొందాలి

తంబళ్లపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పొందాలని ఎంఈఓ త్యాగరాజు అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో ఎంఈఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జిలానీ బాష, ఉపాధ్యాయులు పద్మావతి, విశ్రాంత కార్యదర్శి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కలకడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తేవాలని జడ్పీ హైస్కూల్ (ఉర్దూ) హెచ్ఎం శ్రీధర్ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని 90 మంది విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 60మందికి శనివారం బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. పాఠశాల చైర్మన్ సయ్యద్‌బాషా, ఉపాధ్యాయులు నభీవు ల్లాఖాన్, నసీమ, సుధ, షంషున్నీసా, రహంతుల్లా, అస్లాం, నాసీర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దమండ్యం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి పేర్కొన్నారు. మండలంలో శనివారం పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌ఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలపై మండల అధికారులతో సమావేశమైన డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రజలు అధికారులకు ప్రతి అర్జీ పరిష్కరించాలన్నారు. పెండింగ్, తిరస్కరించబడిన అర్జీలకు సరైన సమాధానం అధికారులకు తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ విమలకుమారి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. శనివారం బోడుమల్లువారిపల్లె సచివాలయం వద్ద సబ్సిడీ ఉలవల పంపిణీని చేపట్టిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. 80 శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలు ఇస్తున్నట్లు తెలిపారు. 10 కిలోల బ్యాగ్ రూ. 560 కాగా 80 శాతం సబ్సిడీతో రూ. 112కే ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్‌తో తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి లీపిక, అగ్రికల్చర్ అసిస్టెంట్ దీపిక, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

బి.కొత్తకోట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా పిలుపునిచ్చారు. 30న కడపలో నిర్వహించే ప్రాంతీయ సదస్సు పోస్టర్లను కార్మికుల షెల్టర్ వద్ద ఆవిష్కరించారు. బాలక్రిష్ణ, మాలిక్, శ్రీనివాసులు, షబ్బీర్, ప్రసాద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు ఆరు లక్షల లీటర్ల నీళ్లు సరఫరా

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సమ్మర్ స్టోరేజ్ నుంచి రోజుకు ఆరు లక్షల లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ సప్లై పథకాన్ని పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ జిల్లా కార్యదర్శి పురుషోత్తం రెడ్డి అలియాస్ కోటపల్లె బాబు రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పట్టణంలోని బండ్లవంక, తిరుపతి రోడ్, ఆర్టీసీ నల్లగుట్ట, ఎస్‌కేడీ నగర్, పద్మావతి నగర్ తదితర ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నుంచి ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ బ్రహ్మానంద రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నైషాద్, ప్రసాద్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డిబాష, టీడీపీ నేతలు సురేంద్ర, చాన్ బాష, పంచాయతీ వాటర్ వర్కర్లు పాల్గొన్నారు.

'బిహార్ ఫలితాల్లోనూ ఓట్ చోరీ'

మదనపల్లె అర్బన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల ఫలితాల్లో ఓట్ చోరీ దాగుందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వస్తుండడం ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయంపై రాష్ట్ర పార్టీ నేతలకు, సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో2029 నాటికి కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణతో శ్రేణులు సమయాత్తం అవుతున్నారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మదనపల్లె టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నేతలు సత్తా చాటాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష సూచించారు. ఎస్వీఆర్ కల్యాణ మండపంలో పట్టణ, మండల టీడీపీ నేతలతో వేర్వేరుగా సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, పట్టణంలోని 35 వార్డుల్లో గ్రామ, వార్డు కమిటీలు టీడీపీ బలోపేతానికి ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ జెండా రెపరెపలాండించాలన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

పశువుల నీడ కోసం షెడ్డు నిర్మాణం



వాల్మీకిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పశు వైద్య శాలలో పశువులకు పరీక్షలు నిర్వహించే బోను ప్రాంతంపై వ్యాపార వేత్త చింతల శ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో షెడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. బోను ఆరుబయట ఉండడంతో పశువులను ఎండలో ఉండాల్సిన పరిస్థితులపై ఇబ్బంది పడుతుండేవారు. రైతుల ద్వారా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, వ్యాపార వేత్త చింతల శ్రీధర్‌రెడ్డి తెలుసుకుని షెడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. వెటర్నరీ ఏడీ విశ్వేశ్వరరెడ్డి, వైద్యులు, రైతులు శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి



బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మదనపల్లె అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ కార్యాలయంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లస్వామి నాయక్ అధ్యక్షతన భగవాన్ బిర్సా ముండా జయంతి నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా బ్రిటీష్‌పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు నాయకత్వం వహించారని కొనియాడారు. బీజేపీ నేత వరదారెడ్డి నారదరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఓసూరి కిరణ్‌కుమార్, జనసేన చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, సామాజిక సేవకురాలు పీట్ల అంజలి, డేరింగుల రమేష్‌రాజు, రామమోహన్ పాల్గొన్నారు.